సాక్షి నిజామాబాద్

సోమవారం । 23 । జూన్ । 2025



మా వాళ్లు పదిలమేనా?

ఇరాన్-ఇజ్రాయిల్ మధ్య యుద్ధం జరుగుతుండడంతో ఇజ్రాయిల్‌లో స్థిరపడిన జిల్లావాసుల కుటుంబసభ్యుల్లో ఆందోళన నెలకొంది.

- 8లో ▸



పోరాటాలతోనే హక్కులు..

పోరాటాలతోనే హక్కులు దక్కుతాయని రాష్ట్ర ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్ ప్రొఫెసర్ రిక్క లింబాద్రి పేర్కొన్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
37.3 /23.8

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

అధికార యంత్రాంగానికి పూర్తి సహకారం



నిజామాబాద్‌అర్బన్: జిల్లా సమగ్రాభివృద్ధి కోసం అధికార యంత్రాంగం చేపట్టే కార్యక్రమాలకు ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందేలా చూస్తామని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్సీ, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఆదివారం జిల్లా కేంద్రానికి వచ్చిన వారితో కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి ఆర్ అండ్ బీ అతిథిగృహంలో సమావేశమయ్యారు. జిల్లా ప్రగతికి తీసుకోవాల్సిన చర్యలు, కొత్త పరిశ్రమల స్థాపనకు అవకాశాలు తదితర అంశాలపై వారు చర్చించారు. భేటీలో రాష్ట్ర ఖనిజ అభివృద్ధి సంస్థ చైర్మన్ అనిల్ ఈరవత్రి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, నుడా చైర్మన్ కేశ వేణు, సహకార యూనియన్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్ర కుమార్, నగరపాలక సంస్థ చైర్మన్ దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

- సీపీ సాయిచైతన్య



నిజామాబాద్‌నాగారం: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయని సీపీ సాయి చైతన్య పేర్కొన్నారు. నగరంలోని పోలీస్ మైదానంలో కమిషనరేట్ పరిధిలోని అన్ని డివిజన్లు, విభాగాల మధ్య ఆదివారం ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీపీ సాయి చైతన్య పోటీలను ప్రారంభించి మాట్లాడారు. పోలీసులు ఉద్యోగ రీత్యా ఎంతో బిజీగా గడుపుతారని, క్రీడలు మానసిక ఒత్తిడిని తట్టుకునేందుకు ఉపయోగపడతాయన్నారు. క్రీడాపోటీల్లో పాల్గొని రిఫ్రెష్ అయిన పోలీసులు తిరిగి మరింత ఉత్సాహంతో విధులు నిర్వర్తించాలన్నారు. ప్రతి ఉద్యోగి ప్రజల కోసం పని చేయాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి ముందుండాలని సూచించారు. రానున్న రోజుల్లో నిజామాబాద్ కమిషనరేట్‌కు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో ఏసీపీలు బస్వారెడ్డి, రామ్‌చందర్ రావ్, రాజా వెంకట్ రెడ్డి, శ్రీనివాస్, జే వెంకటేశ్వర్ రెడ్డి, సీఐలు, ఆర్‌ఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

రేపు క్రికెట్ జట్టు ఎంపికలు

నిజామాబాద్‌నాగారం: జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 24న ఇంటర్ డిస్ట్రిక్ట్ టోర్నమెంట్ కోసం జిల్లా జట్టు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు చంద్రసేన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని గిరిరాజ్ కళాశాల మైదానంలో ఉదయం 8 గంటలకు ఎంపికలు ప్రారంభమవుతాయని, 14 సంవత్సరాల పై వయస్సు ఉన్న వారు పాల్గొనాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 81060 60600 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

పనితీరు అంతంతే..

ఉమ్మడి జిల్లా విద్యాశాఖ పనితీరు అంతంత మాత్రంగానే ఉందని కేంద్ర విద్యాశాఖ తేల్చింది. ప్రభుత్వ బడుల్లో అభ్యసన సామర్థ్యాల నుంచి మౌలిక వసతులు, అడ్మినిస్ట్రేషన్ తదితర విభాగాలపై అధ్యయనం చేసి గ్రేడింగ్ ఇచ్చింది. రాష్ట్రస్థాయిలో కామారెడ్డి జిల్లా 12వ స్థానంలో, నిజామాబాద్ 18వ స్థానంలో నిలిచాయి. విద్యార్థులకు డిజిటల్ విద్య, మధ్యాహ్న భోజనం తదితర అంశాల్లో ఉమ్మడి జిల్లా గ్రేడింగ్‌లో వెనుకబడింది.





- పర్ఫార్మింగ్ గ్రేడ్ ఇండెక్స్ విడుదల చేసిన కేంద్ర విద్యాశాఖ
- వెనుకబడిన ఉమ్మడి జిల్లా
- మౌలిక వసతుల కల్పన, ఉపాధ్యాయుల నియామకంలో వెనుకంజ

నిజామాబాద్‌అర్బన్: ప్రభుత్వ పాఠశాలల పనితీరులో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వెనుకబడింది. కేంద్ర విద్యాశాఖ పాఠశాలల పనితీరుపై ఇటీవల పర్ఫార్మింగ్ గ్రేడ్ ఇండెక్స్(పీజీఐ) విడుదల చేసింది. బడుల్లో మౌలిక వసతుల కొరత, డిజిటల్ విద్యా విధానం లేకపోవడం, తరగతికి ఒక ఉపాధ్యాయుడు నియమించకపోవడంతో అభ్యసన సామర్థ్యం తగ్గి గ్రేడింగ్‌లో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలు వెనుకబడ్డాయి.

కేంద్ర విద్యాశాఖ 2023–24 విద్యా సంవత్సరానికి అన్ని రాష్ట్రాల్లో విద్యాస్థితిగతులపై అధ్యయనం చేసి పనితీరు నివేదికలను జిల్లాలవారీగా విడుదల చేసింది. ఎన్‌సీఈఆర్‌టీ, యూ–డైస్, న్యాస్, ఎండీఎం ద్వారా వివరాలను సేకరించిన కేంద్ర విద్యాశాఖ వాటిని క్రోడీకరించి ఫలితాలను ప్రకటించింది. రాష్ట్రస్థాయిలో జిల్లాల వారీగా చూస్తే కామారెడ్డి జిల్లా 12వ, నిజామాబాద్ 18వ స్థానంలో నిలిచాయి. అలాగే పరిపాలన విధానం, ప్రభావవంతమైన తరగతిదికి సంబంధించిన పరికరాల ద్వారా, క్షేత్రస్థాయి బోధనలో మంచి ఫలితాలను సాధించగా.. మిగతా అంశాల్లో తగిన మార్కులు ఉమ్మడి జిల్లా సాధించలేకపోయింది.

కేంద్ర విద్యాశాఖ విడుదల చేసిన నివేదికలోని ఉమ్మడి జిల్లా పర్ఫార్మెన్స్..

అంశం	మొత్తం మార్కులు	నిజామాబాద్	కామారెడ్డి
అభ్యసన సామర్థ్యాలు	290	102	102
ప్రభావవంతమైన తరగతి గది	90	45	46
మౌలిక వసతులు	51	29	30
పాఠశాల భద్రత, విద్యార్థి సంరక్షణ	35	09	15
డిజిటల్ లర్నింగ్	50	13	10
పరిపాలన విధానం	84	54	55
మొత్తం	600	252	258

పర్యవేక్షణ.. ప్రక్షాళన లేక..

పాఠశాల విద్యాశాఖలో ప్రతి విద్యార్థిని పాస్ చేయించి పై తరగతికి పంపించే క్రమంలో కాగితాలు మారుతున్నా.. విద్యార్థుల సూక్ష్మ ప్రగతిని ఉపాధ్యాయులు అంచనా వేయలేకపోతున్నారు. తరగతికి ఒక ఉపాధ్యాయుడు లేకపోవడంతో ప్రాథమిక బడుల్లో విద్యార్థుల నమోదు క్రమంగా తగ్గుతోంది. చాలా పాఠశాలల్లో సరైన మరుగుదొడ్లు, మూత్రశాలలు, అదనపు గదులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో కంప్యూటర్లు లేక విద్యార్థులకు డిజిటల్ విద్య అందడం లేదు. మధ్యాహ్న భోజన నిర్వహణలో వంట సిబ్బందికి ఇస్తున్న సొమ్ము సరిపోక విద్యార్థులకు పౌష్టికాహారం అందడం లేదు. ఉమ్మడి జిల్లాలో ఒక్క నిజామాబాద్ రూరల్ మండలంలో తప్ప అన్ని మండలాల్లో ఇన్‌చార్జి ఎంఈవోలు ఉండడంతో పర్యవేక్షణ గాడితప్పింది.

మెరుగైన విద్య అందిస్తున్నాం

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యను అందిస్తున్నాం. ప్రతి ఏటా ఉత్తమ ఫలితాలు వస్తున్నాయి. కొన్ని చోట్ల ఫలితాలు రాని పాఠశాలలపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నాం. మౌలిక సదుపాయాలు సైతం కల్పిస్తున్నాం. ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. – అశోక్, జిల్లా విద్యాశాఖ అధికారి

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



లబ్ధిదారుకు ప్రొసీడింగ్ అందజేస్తున్న పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్, షబ్బీర్ అలీ, ధన్‌పాల్ తదితరులు

- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్
- అర్బన్‌లో 3500 మందికి ఇస్తాం
- ఎవరికీ నయా పైసా ఇవ్వొద్దు
- లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేత

నిజామాబాద్ సిటీ: అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని పీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. నిజామాబాద్ అర్బన్‌లో 3,500 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఇంద్రపురి కాలనీలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ కాపీలు అందజేశారు. ఈ సందర్భంగా పీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. ఇల్లు లేని ప్రతి పేదవాని సొంతింటి కలను నిజం చేసేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం తెచ్చిందన్నారు. ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.5 లక్షలు సహాయం చేస్తుందని తెలిపారు. ఈ పథకంలో ఎవరికీ నయా పైసా ఇవ్వాల్సిన అవసరం లేదని, దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. సొంత స్థలాలు లేని వారి కోసం త్వరలోనే ఇందిరమ్మ కాలనీలు నిర్మిస్తామని ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్ తెలిపారు. ప్రతి ఒక్కరికీ సొంతిళ్లు ఉండాలన్నదే సీఎం రేవంత్‌రెడ్డి ఆశయం అన్నారు. నిజామాబాద్ నగర జనాభాను దృష్టిలో ఉంచుకొని పేదలకు ఇచ్చే ఇంటి సంఖ్యను పెంచాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త అన్నారు. ఇందిరమ్మ ఇళ్లను 3,500 మాత్రమే కేటాయించిందని, ఇవి సరిపోవన్నారు. కార్యక్రమంలో వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు తాహెర్‌బిన్ హందాన్, మానాల మోహన్‌రెడ్డి, ఈరవత్రి అనిల్, గ్రంథాలయ చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి, నుడా చైర్మన్ కేశ వేణు, రాంభూపాల్, బాడ్సి శేఖర్‌గౌడ్, రత్నాకర్, జావెద్ అక్రం, మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్, టీపీఆర్‌వో చిదుర రమేశ్, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికలప్పుడే పథకాల అమలు

- రైతులను దగా చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి విమర్శ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

నిజామాబాద్‌అర్బన్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలప్పుడే పథకాలు అమలు చేస్తోందని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలు లేనప్పుడు పథకాలను ఎగ్గొడుతూ కాంగ్రెస్ ప్రజలను మోసం చేస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత నాలుగు పంట సీజన్లు వచ్చాయని, ఇందులో మొదటి పంటకు ఎంపీ ఎన్నికలు ఉండడంతో రైతుభరోసా అమలు చేశారని, రెండు, మూడో పంటకు ఎన్నికలు లేకపోవడంతో ఇవ్వలేదన్నారు. నాలుగోసారి స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నాయని రైతుభరోసా ఇచ్చారని అన్నారు. ఇప్పటికీ సగం మందికి రుణమాఫీ చేయలేదని, విత్తనాలు, ఎరువులు అందుబాటులో లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ హయాంలో ముందస్తుగానే ఎరువులు అందుబాటులో ఉండేవని గుర్తుచేశారు. రూ.2 లక్షల రుణమాఫీ, అన్ని రకాల వడ్లకు బోనస్ ఇచ్చిన తర్వాత స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్లు అడగడానికి రావాలన్నారు. సమావేశంలో జెడ్పీ మాజీ చైర్మన్ విఠల్‌రావు, నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘సిట్’ నుంచి కాంగ్రెస్ నేతకు పిలుపు

- వాంగ్మూలం ఇవ్వాలంటూ ఫోన్ కాల్
- ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో మరో బాధితుడు

కామారెడ్డి క్రైం: రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన ఫోన్ ట్యాపింగ్ కేసు కామారెడ్డిలోనూ కలకలం రేపుతోంది. న్యాయవాది, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాజగోపాల్‌రెడ్డి ఫోన్ కూడా ట్యాపింగ్‌కు గురైనట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో వాంగ్మూలం కోసం హైదరాబాద్‌లోని తమ కార్యాలయానికి రావాలంటూ సిట్ ఆయనకు ఆదివారం ఫోన్ కాల్ ద్వారా తెలిపింది. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాజగోపాల్‌రెడ్డికి పార్టీలో ప్రాధాన్యత ఉంది. ఆయన షబ్బీర్ అలీకి నమ్మకమైన వ్యక్తి. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కామారెడ్డి నుంచి పోటీ చేసిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రచార బాధ్యతలను ఎక్కువగా అయన సోదరుడు కొండల్‌రెడ్డి చూసుకున్నారు. రాజగోపాల్‌రెడ్డి సైతం కొండల్‌రెడ్డి వెంటే ఉంటూ పార్టీ ప్రచార, ఆర్థిక వ్యవహారాలను పర్యవేక్షించారు. రాజగోపాల్‌రెడ్డితోపాటు జిల్లాలోని పలువురి ఫోన్‌లు సైతం ట్యాపింగ్‌కు గురైనట్లు అనుమానిస్తున్నారు. ఈ వ్యవహారం రానున్న రోజుల్లో ఎవరి మెడకు చుట్టుకుంటుందో అని కొందరు అధికారులు, నేతలు ఆందోళన చెందుతున్నట్లు తెలుస్తోంది.

అసలేం జరిగిందంటే..

గత అసెంబ్లీ ఎన్నికలలో కామారెడ్డి నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా మాజీ సీఎం కేసీఆర్, కాంగ్రెస్ నుంచి ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి పోటీ చేశారు. తన ప్రత్యర్థి వర్గం కదలికలను తెలుసుకోవడానికి కేసీఆర్ వర్గం ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిందనే ఆరోపణలు ఉన్నాయి. ఓ ట్యాపింగ్ బృందాన్ని కామారెడ్డికి పంపి ప్రతిపక్షాల ఆర్థిక మూలాలను టార్గెట్ చేశారని కేసు ప్రారంభంలో జరిగిన విచారణలో తేలింది.

ఆకతాయిల ఆటలు

- ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ప్రాంతంలో పర్యాటకులకు ఇబ్బందులు



మద్యం సేవిస్తూ నీటిలో ఫొటోలు దిగుతున్న యువకులు

డొంకేశ్వర్(ఆర్మూర్): పర్యాటకులను ఆకర్షిస్తున్న ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్ ప్రాంతంలో ఆకతాయిలు ఆటలాడుతున్నారు. పోలీసు, ఇతర శాఖల అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పర్యాటకులతో కళకళలాడాల్సిన ప్రాంతం మందుబాబులకు అడ్డాగా మారింది. డొంకేశ్వర్ మండలం చిన్నయానం, జీజీ నడ్కుడ, గాదేపల్లి శివార్లలోని ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ప్రాంతానికి ఇటీవల పర్యాటకుల తాకిడి పెరిగింది. ఆదివారంతోపాటు సెలవు రోజుల్లో ఎక్కువ మంది వస్తున్నారు. పచ్చని ప్రకృతిని ఆస్వాదిస్తూ అక్కడే భోజనాలు చేస్తున్నారు. అయితే గ్యాంగులుగా వస్తున్న యువకులు మద్యం సేవిస్తూ సీసాలను పగులగొడుతున్నారు. బైకులు, కార్లు ప్రమాదకరంగా నడుపుతున్నారు. పర్యాటకులకు ఇబ్బందులు కలిగిస్తున్నారు.

ప్రకృతిని పాడు చేస్తున్నారు..



బ్యాక్ వాటర్‌కు పర్యాటకులు చాలా మంది వస్తున్నారు. యువకులు మద్యం సేవించి, సీసాలను పగులగొడుతూ అల్లరి చేస్తున్నారు. దీంతో పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. పోలీసులు స్పందించి వైపు నిఘా పెట్టాలి. – మోహన్, చిన్నయానం

రేపు చలో తెలంగాణ యూనివర్సిటీ



మాట్లాడుతున్న పీబీ సత్యం

భిక్కనూరు: చలో డిచ్‌పల్లి తెలంగాణ యూనివర్సిటీ కార్యక్రమాన్ని ఈనెల 24న నిర్వహిస్తున్నట్లు పూర్వ జేఏసీ అధ్యక్షుడు పీబీ.సత్యం తెలిపారు. ఆదివారం ఆయన భిక్కనూరులోని సౌత్ క్యాంపస్‌లో మాట్లాడారు. పీహెచ్‌డీ పూర్తి చేసిన విద్యార్థులకు తెలంగాణ యూనివర్సిటీ ద్వితీయ కాన్వకేషన్ రోజున పట్టాలను ఆనాటి ముఖ్య అతిథుల చేతుల మీదుగా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు. విద్యార్థి నేతలు భరత్, రమేష్, శ్రీనివాస్, పాండు, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం ఉరుకులు

- కొరత ఉందంటూ ప్రచారం
- పంట వేయకముందే కొనుగోలు చేస్తున్న రైతులు
- జిల్లాలో ఇప్పటి వరకు అమ్ముడైన యూరియా 17వేల మెట్రిక్ టన్నులు



వ్యాగన్ నుంచి లారీలోకి యూరియా లోడింగ్ (ఫైల్)

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లాలో యూరియా విక్రయాలు జోరందుకున్నాయి. కొరత ఉందనే ప్రచారం జరగడంతో రైతులంతా సొసైటీల వద్దకు పరుగులు తీస్తున్నారు. పంట వేయకముందే పెద్ద మొత్తంలో యూరియా బస్తాలను కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. దీంతో పలు సొసైటీల గోదాములు నిండుకుంటున్నాయి. తమకు ఇంకా యూరియా బస్తాలు కావాలని వ్యవసాయ, మార్క్‌ఫెడ్ శాఖలను సొసైటీలు కోరుతున్నాయి. వర్షాకాలం సీజన్ ప్రారంభమైన కొన్ని రోజుల్లోనే జిల్లా వ్యాప్తంగా 17వేల మెట్రిక్ టన్నులు అమ్ముడు పోవడంతో వ్యవసాయ శాఖ ముక్కున వేలేసుకుంటోంది. బఫర్ స్టాక్ నిల్వలు సైతం వేగంగా తగ్గిపోవడంతో డిమాండ్‌కు తగ్గట్లుగా యూరియాను తెప్పించేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ప్రస్తుతం యూరి యా నిల్వ 17వేల మెట్రిక్ టన్నులు మాత్రమే ఉంది. జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్‌లో 5.21లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. దీనికి తగ్గట్లుగానే 75,499 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని అంచనా వేయగా ఇప్పటికే సగం కోటా జిల్లాకు వచ్చింది.

నియంత్రణేదీ..?

జిల్లాలో ఇప్పటి వరకు 50వేల ఎకరాల్లోనే వరినాట్లు పడ్డాయి. మొక్కజొన్న 15,400 ఎకరాల్లో, సోయా 17,776 ఎకరాల్లో విత్తారు. పంటలు సగం కూడా సాగవక ముందే యూరియా ఎక్కువ మొత్తంలో అమ్ముడవుతోంది. పంటలకు మూడు దఫాలుగా వేసే యూరియాను రైతులు ఒకేసారి కొనుగోలు చేసి తీసుకెళ్లి నిల్వ చేసుకుంటున్నారు. పలుకుబడి ఉన్న రైతుకు 50 బస్తాల వరకు ఇస్తున్నారు. దీంతో స్టాకు లేక చిన్న, సన్నకారు రైతులకు యూరియా అందడం లేదు. కొరత ఉందనే ప్రచారం జరుగుతుండడంతో రైతులంతా రూ.50 ఎక్కువైనా సరేనని బస్తాలను కొంటున్నారు. వరి, మక్క పంటలకు అవసరానికి మించి యూరియాను వాడుతున్నారు. యూరియా అమ్మకాలపై అధికారులు నియంత్రణ, నిఘా సారించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పరిమితంగానే బస్తాలను ఇచ్చే విధంగా చర్యలు చేపట్టాలని పలువురు రైతులు కోరుతున్నారు.

విక్రయాలను పరిశీలిస్తున్నాం



జిల్లాలో యూరియా కొరత లేకున్నప్పటికీ దానికి విరుద్ధంగా ప్రచారం జరుగుతుండడంతో రైతులు అవసరానికి మించి బస్తాలను కొంటున్నారు. యూరియాను దఫాల వారీగా కొని తీసుకెళ్లాలి. కానీ ఒకేసారి తీసుకెళ్లడంతో మిగతా రైతులకు సమయానికి అందించడం ఆలస్యమవుతోంది. ఒకే రైతుకు ఎక్కువ మొత్తంలో ఇవ్వకుండా దఫాల వారీగా తీసుకెళ్లేలా చూడాలని సహకార అధికారులను కోరాం. – వీరాస్వామి, జిల్లా వ్యవసాయాధికారి

క్లుప్తంగా

నూతన కార్యవర్గం ఎన్నిక



నిజామాబాద్‌నాగారం: నగరంలోని కంఠేశ్వర్ బైపాస్ చౌరస్తాలోగల మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం కార్యాలయంలో ఆదివారం జిల్లా మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన కమిటీకి ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అధికారులుగా రవీందర్, గురుచరణ్, పరిశీలకులుగా ఎస్‌జీ పద్మారావులు వ్యవహరించారు. సంఘ సభ్యులు ఓట్లు వేసి నూతన కార్యవర్గాన్ని ఎనుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా పల్లె స్వామిదాస్, ప్రధాన కార్యదర్శిగా చొక్కం దేవిదాస్, అసోసియేట్ అధ్యక్షుడిగా ఎన్ రాములు, ఉపాధ్యక్షులు బీసా భూమయ్య, లింగయ్య, జాయింట్ కార్యదర్శిగా కస్తు దేవయ్య, జక్కు ప్రభుదాస్, కోశాధికారిగా శంకరయ్య, పబ్లిసిటీ కార్యదర్శిగా గంగాధర్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రాజన్న, సభ్యులుగా ముత్తెన్న, నర్సయ్య, అన్నయ్య, స్వామిదాస్‌లు ఎన్నికయ్యారు.

జీతాలు ఇవ్వండి సారూ..



బోధన్‌టౌన్(బోధన్): బోధన్ ప్రభుత్వ ఆస్పత్రిలో కాంట్రాక్ట్ పద్ధతిన విధులు నిర్వహిస్తున్న కార్మికులకు జీతాలు రాక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో పారిశుద్ధ్య, పేషెంట్ కేర్, సెక్యూరిటీ విభాగాల్లో 42 మంది కార్మికులు పనిచేస్తుండగా, వారికి 4 నెలలుగా జీతాలు రావడం లేదు. దీంతో డబ్బులు లేక కుటుంబ పోషణ ఇబ్బందిగా మారిందంటూ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేతనాలు త్వరితగతిన చెల్లించేలా చూడాలని ఆస్పత్రి ఉన్నతాధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్ వేతనాలను చెల్లించి ఆదుకోవాలని కార్మికులు కోరుతున్నారు.

అనుమతులు లేవు.. పర్యవేక్షణ లేదు

- ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ప్రాంతాల్లో జోరుగా మట్టి తవ్వకాలు
- సమీపంలోని ఇటుక బట్టీలకు తరలింపు
- పట్టించుకోని అధికారులు



జలాల్‌పూర్ శివారులో ఏర్పాటు చేసిన ఇటుక బట్టీల వద్ద డంప్ చేసిన మట్టి (ఫైల్)



బాల్కొండ మండలం జలాల్‌పూర్ శివారులో బ్యాక్ వాటర్ నిలిచే ప్రాంతం నుంచి యంత్రాలతో చేపడుతున్న మట్టి తవ్వకాలు (ఫైల్)

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ నిలిచే ప్రాంతాన్ని కేంద్రంగా చేసుకుని మట్టి మాఫియా మట్టి దందాను జోరుగా సాగిస్తోంది. బాల్కొండ మండలం జలాల్‌పూర్, నాగాపూర్ శివారులో బ్యాక్ వాటర్ నిలిచే ప్రాంతంలో ఎలాంటి అనుమతులు లేకుండానే పొక్లెయిన్లతో మట్టి తవ్వకాలను అడ్డగోలుగా చేపడుతున్నారు. అయినా ప్రాజెక్ట్ అధికారులు తమకేమి సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు.

ఇటుక బట్టీలకు తరలింపు..

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ నిలిచే ప్రాంతం చుట్టూరుగా ఎలాంటి అనుమతులు లేకుండా ఇటుక బట్టీలు వెలిశాయి. ఆ ఇటుక బట్టీల కోసం ఎస్సారెస్పీ నుంచి మట్టి తవ్వకాలను చేపట్టి మట్టిని తరలిస్తున్నారు. అనుమతులు లేవు అనుకుంటూనే అధికారులు ఓ రకమైన అనుమతులు ఇస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. ప్రాజెక్ట్ అధికారుల అనుమతితో చలాన్ రూపంలో ప్రభుత్వానికి క్యూబిక్ మీటర్‌కు రూ. 133 జమ చేసి అధికారుల పర్యవేక్షణలో మట్టి తవ్వకాలను చేపట్టాలి. కాని ఇక్కడ అవేమీ లేకుండానే మట్టి దందాను సాగిస్తున్నారు.

పెద్ద హై డ్రామా..

ఇటీవల 'సాక్షి' మట్టి తవ్వకాలు చేపడుతున్న ప్రాంతం వద్ద నుంచి ప్రాజెక్ట్ ఈఈ చక్రపాణికి ఫోన్‌లో సమాచారం అందించి, వివరణ కోరింది. వెంటనే స్పందించిన అధికారి కిందిస్థాయి అధికారులను తవ్వకాలు చేపడుతున్న ప్రాంతానికి పంపించారు. కానీ సదరు కిందిస్థాయి అధికారి వచ్చేలోపే యంత్రాలు, ట్రాక్టర్లు అక్కడి నుంచి పరారీ అయ్యాయి. అంటే సమాచార మిచ్చింది సంబధిత అధికారులే కావడంతో అక్కడ ఎలాంటి యంత్రాలు లభించ లేదు. దీంతో ఎవరు లేరు అంటూ ఉన్నతాధికారులకు, కింది స్థాయి అధికారులు పేర్కొన్నారు. దీంతో ఇదంత అధికారుల కనుసన్నల్లోనే జరుగుతుందని చెప్పవచ్చు. రైతులకు భూసారం పెంచుకోవడం కోసం మట్టి తవ్వకాలు చేపడితే కొర్రీలు పెట్టే అధికారులు ఇటుక బట్టీలకు మట్టిని తరలిస్తే మిన్నకుండటం వెనుక మతలబు ఏమిటో అధికారులే చెప్పాలి. మట్టి మాఫియాతోపాటు ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతు జేబులు నింపుకుంటున్నా అధికారులపై కూడ చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

అనుమతులు ఇవ్వలేదు..

ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ నిలిచే ప్రాంతం నుంచి ఎవరికి మట్టి తవ్వకాల కోసం అనుమతులు ఇవ్వలేదు. ప్రాజెక్ట్ నుంచి అక్రమంగా మట్టి, మొరం తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

– చక్రపాణి, ఈఈ, ఎస్సారెస్పీ

ప్రయివేటు నుంచి ప్రభుత్వానికి మారిన కళాశాల

మీకు తెలుసా?



ఆర్మూర్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల

ఆర్మూర్ పట్టణ శివారులోని పిప్రి రోడ్డులోగల 105 ఎకరాల విస్తీర్ణంలో కేవీ రెడ్డి అనే వ్యక్తి ఆధ్వర్యంలో 1966లో ఎడ్యుకేషన్ సొసైటీ స్థాపించి కళాశాలను ఏర్పాటు చేశారు. డాక్టర్ లక్ష్మణ్‌రావ్ ఈ కళాశాలకు మొట్ట మొదటి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వహించారు.

- 1967 జూలై 3న యూజీసీ పరిధిలోకి తీసుకొని యూజీసీ యాక్ట్ 2ఎఫ్ (12బీ) గుర్తింపును ఇచ్చారు. 1969–70లో ఇంటర్మీడియట్ విధానాన్ని ప్రారంభించారు.
- 1981లో అప్పటి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఈ కళాశాలను స్వాధీనం చేసుకుంది. నాటి నుంచి ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలగా పిలవడం ప్రారంభించారు.
- 1996లో బాలుర ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాలను రెండుగా వేరు చేశారు.
- 2006లో ఈ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నాక్ (ఎన్ఏఏసీ, నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడియేషన్ కౌన్సిల్) మొదటి ఫేస్ గుర్తింపు వచ్చింది.
- జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అనంతరం జిల్లాలో నాక్ గుర్తింపు ఉన్న ఏకైక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆర్మూర్ కళాశాల.

– ఆర్మూర్

పోరాటాలతోనే హక్కులు సాధ్యం



టీయూసీఐ ప్రతినిధుల సభలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ రిక్క లింబాద్రి



హాజరైన పార్టీ కార్యకర్తలు, అభిమానులు

- కార్మిక హక్కుల రక్షణకు బలమైన ఉద్యమాలు నిర్మించాలి
- ఉన్నత విద్యా మండలి మాజీ ఛైర్మన్ ప్రొఫెసర్ రిక్క లింబాద్రి

నిజామాబాద్ సిటీ: పోరాటాలతోనే హక్కులు దక్కుతాయని, కార్మిక హక్కుల రక్షణ కోసం బలమైన ఉద్యమాలు నిర్మించాల్సిన ఆవశ్యకత ఉందని ఉన్నత విద్యామండలి మాజీ ఛైర్మన్ ప్రొఫెసర్ రిక్క లింబాద్రి పేర్కొన్నారు. ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) రాష్ట్ర మహాసభల్లో భాగంగా 2వ రోజు జిల్లా కేంద్రంలోని న్యాల్‌కల్ రోడ్‌లో ఉన్న ఓ ఫంక్షన్ హాల్‌లో ప్రతినిధుల సభ నిర్వహించారు. ఈ సందర్భంగా లింబాద్రి మాట్లాడుతూ కార్పొరేట్ కంపెనీలే కాకుండా ప్రభుత్వాలు సైతం శ్రమదోపిడికి పాల్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న కార్మికులందరికీ కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. కార్మికులకు ఉద్యోగ, ఆరోగ్య భద్రత కల్పించడం ప్రభుత్వాల బాధ్యత అని గుర్తుచేశారు. టీయూసీఐ రాష్ట్ర నాయకులు వనమాల కృష్ణ, సూర్యం మాట్లాడుతూ.. సామ్రాజ్యవాద శక్తులతో మతోన్మాద శక్తులు కలిసి దేశాన్ని పీడిస్తున్నాయన్నారు. ధరల పెరుగుదల, ఉపాధి అవకాశాలు లేకపోవడంతో పేద, మధ్యతరగతి ప్రజల పరిస్థితి దారుణంగా మారిందన్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం భారత ప్రజల ప్రయోజనాలను అమెరికాకు తాకట్టు పెడుతోందని ఆరోపించారు. వచ్చే నెల 9న కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె ద్వారా మోదీ ప్రభుత్వానికి కార్మిక శక్తిని తెలియజేస్తామన్నారు. సమావేశంలో టీయూసీఐ నాయకులు ఎం నరేందర్, ఎస్‌ఎల్ పద్మ, ఎం హన్మేష్, కే రాజన్న, జీ రామయ్య, సీ వెంకటేశ్, ముస్కె సుధాకర్, వెంకన్న, రాజేశ్వర్, ముత్తెన్న, మల్లేశ్ సత్యక్క, రమేశ్, యాకుబ్ షావలి, వెంకట్, రెడ్డి, అశోక్, సాంబశివుడు, కిరణ్, ప్రసాద్, హనుమంతు, రాజు, దేవదానం, రామ్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



నిజామాబాద్‌లోని కాకతీయ జూనియర్ కళాశాల 2002-04 ఇంటర్ సీఈసీ బ్యాచ్ విద్యార్థులు

మోపాల్: నగర శివారులోని బోర్గాంలోగల ఓ ఫామ్ హౌస్‌లో ఆదివారం నిజామాబాద్‌లోని కాకతీయ జూనియర్ కళాశాల 2002–04 సీఈసీ గ్రూప్ విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఏళ్ల తర్వాత ఆనాటి మిత్రులంతా మళ్లీ ఒక్కచోటికి చేరడంపై వారంతా హర్షం వ్యక్తం చేశారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ యోగక్షేమాలు తెలుసుకున్నారు. కార్యక్రమాన్ని వారంతా ప్లాస్టిక్ రహితంగా నిర్వహించుకోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. బ్యానర్‌ను వస్త్రంతో ఏర్పాటు చేయగా, భోజనాలకు ఆకుతో చేసిన ప్లేట్లను, మొక్కజొన్న కంకులతో చేసిన గ్లాసులను వాడారు.



మాచారెడ్డి: పాల్వంచ మండలం ఫరీదుపేట ఉన్నత పాఠశాల 1999 –2000 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. పాల్వంచమర్రిలోని ఆర్‌ఆర్ ఫంక్షన్‌హాల్‌లో కార్యక్రమం ఘనంగా ఏర్పాటు చేసుకున్నారు.

విద్యుత్‌షాక్‌తో యువకుడి మృతి



ఎల్లారెడ్డి: విద్యుత్‌షాక్‌తో యువకుడు మృతిచెందిన ఘటన ఎల్లారెడ్డి మండలంలోని తిమ్మాపూర్‌తండాలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని తిమ్మాపూర్‌తండాకు చెందిన నేనావత్ రవి(32)అనే యువకుడు ఆదివారం సాయంత్రం తమ ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి సంబంధించిన బేస్‌మెంట్‌కు నీళ్లు పట్టడానికి వెళ్లాడు. ఈక్రమంలో మోటార్ స్విచ్ ఆన్ చేస్తుండగా విద్యుత్ షాక్ తగిలి మృతిచెందాడు. మృతుడికి భార్యతోపాటు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



కామారెడ్డి క్రైం: ఓ తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన ఘటన జిల్లా కేంద్రంలోని గుమాస్తా కాలనీలో ఆదివారం వెలుగు చూసింది. వివరాలు ఇలా.. హన్మకొండకు చెందిన నయీం పాషా యేడాదిన్నరగా కామారెడ్డి డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఉద్యోగిగా పని చేస్తూ గుమాస్తా కాలనీలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. ఆరోగ్య సమస్యల కారణంగా 6 నెలలుగా హన్మకొండకు కుటుంబంతో కలిసి వెళ్లాడు. ఆదివారం ఉదయం అతడి ఇంటి తాళం పగులగొట్టి ఉండటాన్ని గమనించిన ఇంటి యజమాని రాజయ్య వెంటనే నయీంపాషాకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. దేవునిపల్లి ఎస్సై రాజు, సిబ్బంది విచారణ జరిపారు. ఇంట్లోని బీరువాలో దాచి ఉంచిన మూడున్నర తులాల బంగారు, 20 తులాల వెండి ఆభరణాలు, కొంత నగదు చోరీకి గురైనట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని ఎస్సై తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో దుకాణం దగ్ధం



బాన్సువాడ: పట్టణంలోని బాట చెప్పుల దుకాణంలో ఆదివారం మధ్యాహ్నం షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగింది. షోరూం నిర్వాహకులు ఉదయం దుకాణం తెరిచి మధ్యాహ్నం మూసివెళ్లారు. కొద్దిసేపటికి దుకాణంలోంచి పొగలు రావడంతో స్థానికులు గమనించి దుకాణ యజమానికి సమాచారం అందించారు. వెంటనే ఆయన అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. కానీ అప్పటికే మంటల వ్యాపించి దుకాణంలోని సామగ్రి, చెప్పులు కాలిపోయాయి. దుకాణంలో పెద్ద ఎత్తున పొగ నిండిపోవడంతో లోపల ఉన్న వస్తువులు తీసేందుకు ఇబ్బందులు పడ్డారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. పెద్ద ఎత్తున నష్టం వాటిల్లినట్లు షోరూం యజమాని తెలిపారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు




రుద్రూర్: మండలంలోని అక్బర్ నగర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. ఆదివారం సాయంత్రం రుద్రూర్ వైపు వెళుతున్న ఆటోను వెనుక నుంచి వేగంగా వస్తున్న ఆయిల్ ట్యాంకర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ఓ చిన్నారితోపాటు ఇద్దరు మహిళలకు గాయాలయ్యాయి. స్థానికులు గమనించి వెంటనే క్షతగాత్రులను చికిత్స నిమిత్తం బోధన్ ఆస్పత్రికి తరలించారు.

దాడి చేసిన వారిపై కేసు నమోదు

రుద్రూర్: పోతంగల్ మండలం జల్లాపల్లిఫారంలో డబ్బుల విషయమై ఘర్షణ పడి దాడి చేసిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై సునీల్ తెలిపారు. వివరాలు ఇలా.. జల్లాపల్లిఫారంకు చెందిన శ్రీకాంత్, బీర్కూర్ తండాకు చెందిన సుధాకర్‌కు డబ్బుల విషయంలో గొడవ జరిగింది. గ్రామ పెద్దల సమక్షంలో డబ్బుల సమస్య గూర్చి శనివారం మాట్లాడుతుండగా బీర్కూర్‌కు చెందిన ముగ్గురు, జల్లాపల్లిఫారంకు చెందిన ఇద్దరు గొడవ పడి శ్రీకాంత్, ఆయన తండ్రి ఓంకార్‌పై దాడి చేశారు. దీంతో బాధితులు ఆదివారం వారిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఈదురు గాలులకు కూలిన చెట్లు



వేల్పూర్: మండలంలోని పడగల్ గ్రామంలో ప్రధాన రహదారిపై ఆదివారం మధ్యాహ్నం రెండు భారీ వృక్షాలు నేలకూలాయి. వర్షంతోపాటు బలమైన గాలుల కారణంగా గ్రామంలోని బీసీ హాస్టల్ ఆవరణలో ఉన్న చెట్టు నేలకూలి, రోడ్డుపై ఉన్న మరో చెట్టుపై వాలింది. అనంతరం రెండు చెట్లు రోడ్డుపై కూలిపోయాయి. ఆ సమయంలో రహదారిపై ప్రయాణికులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. చెట్లు రహదారిపై కూలిపోవడంతో వన్నెల్ బి వైపు రాకపోకలు చాలాసేపు నిలిచిపోయాయి. గ్రామస్తులు చెట్లను తొలగించడంతో తిరిగి రాకపోకలు ప్రారంభమయ్యాయి.

పేకాడుతున్న తొమ్మిది మంది అరెస్టు

నిజాంసాగర్(జుక్కల్): నిజాంసాగర్ ప్రాజెక్టు సమీపంలో ఆదివారం పేకాట ఆడుతున్న 9మందిని అరెస్టు చేసినట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడి చేయగా పేకాడుతున్న 9 మందిని అదుపులోకి తీసుకున్నామన్నారు. అలాగే వారి వద్ద నుంచి రూ.40వేల నగదు, 7 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

వృద్ధురాలి అదృశ్యం



బాన్సువాడ రూరల్: బీర్కూర్ మండలం మిర్జాపూర్‌కు చెందిన అంజవ్వ అనే వృద్ధురాలు అదృశ్యమైనట్లు బాన్సువాడ పోలీసులు తెలిపారు. మిర్జాపూర్‌కు చెందిన అంజవ్వ ఏడాది కాలంగా బోర్లంలో నివాసం ఉంటుంది. అంజవ్వ ఈనెల 16న ఎప్పటిలాగే పింఛన్ డబ్బులు, రేషన్ బియ్యం కోసం మిర్జాపూర్ వెళ్లింది. కానీ ఇప్పటికి ఇంటికి తిరిగి రాలేదు. దీంతో ఆమె ఆచూకీ కోసం కుటుంబసభ్యులు వాట్సాప్‌గ్రూపులో పోస్టు చేయగా దోమకొండ బస్టాండ్‌లో కన్పించినట్లు తెలిసింది. కానీ అక్కడికి వెళ్తే సరికి అమె కామారెడ్డి బస్సు ఎక్కి వెళ్ళిపోయినట్లు స్థానికులు తెలిపారు. ఆమె ఆచూకీ లభించకపోవడంతో ఆమె అల్లుడు బోర్లం గ్రామానికి చెందిన కాదిరెడ్డి విజయ్‌కుమార్ బాన్సువాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంటి నుంచి వెళ్ళేటప్పుడు ఆరెంజ్ కలర్ చీర, పసుపురంగు జాకెట్టు ధరించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె ఎవరికైనా కనిపిస్తే సెల్‌నెంబర్ 9989354036కు సమాచారం అందించాలన్నారు.

గుండారంలో ఒకరు..

నిజామాబాద్‌రూరల్: గుండారం గ్రామ శివారులో ఉన్న క్లాసిక్ పేపర్‌మిల్‌లో పనిచేస్తున్న రాకేష్‌కుమార్ అనే వ్యక్తి అదృశ్యమైనట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో మహ్మద్ ఆరీఫ్ ఆదివారం తెలిపారు. బీహార్ రాష్ట్రానికి చెందిన రాకేష్‌కుమార్ తన తమ్ముడు చోటన్‌కుమార్‌తో కలిసి ఈనెల 4న పేపర్‌మిల్‌కు ఉపాధి నిమిత్తం వచ్చాడు. కొన్ని రోజులుగా రాకేష్ కనబడకపోవడంతో బీహార్‌లో ఉన్న కుటుంబసభ్యులకు ఫోన్‌లో సంప్రదించారు. వారు ఇక్కడకు రాలేదని తెలపడంతో అతడి తమ్ముడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మా వాళ్లు పదిలమేనా?

- ఉపాధి, విద్య అవకాశాల కోసం ఇజ్రాయిల్‌లో స్థిరపడిన పలువురు జిల్లావాసులు
- ఇరాన్–ఇజ్రాయిల్ దాడుల నేపథ్యంలో జిల్లాలోని వారి కుటుంబాల్లో ఆందోళన



ఇజ్రాయిల్‌లోని ఓ బంకర్‌లో తలదాచుకున్న జిల్లావాసులు (ఫైల్)

ఆర్మూర్: ఇరాన్–ఇజ్రాయిల్ దేశాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొనడంతోపాటు, నిత్యం దాడులు జరుగుతున్న నేపథ్యంలో ఇజ్రాయిల్‌లో స్థిరపడిన జిల్లావాసుల గురించి ఇక్కడి కుటుంబసభ్యులు ఆందోళన చెందుతున్నారు. ఉపాధి, విద్య అవకాశాల కోసం తెలంగాణ రాష్ట్రం నుంచి ఎంతో మంది ఇజ్రాయిల్ దేశం తరలివెళ్లారు. వారిలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లానుంచి వెళ్లిన వారు పదుల సంఖ్యలో ఉంటారు. ఇజ్రాయిల్ సైన్యం శత్రు దేశాల దాడులను ఎప్పటికప్పుడు తిప్పికొడుతున్నా.. స్థానికంగా వలసవాదుల కుటుంబీకులు ఆందోళన చెందుతూ తమ వారికి ఫోన్లు చేస్తూ ఎప్పటికప్పుడు క్షేమ సమాచారం తెలుసుకుంటున్నారు.

నిజామాబాద్, కరీంనగర్, నిర్మల్, మెదక్, జగిత్యాల జిల్లాలతో పాటు తెలంగాణ వ్యాప్తంగా సుమారు 800 మంది ఇజ్రాయిల్‌లో ఉపాధి కల్పించుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం టామ్‌కామ్ ద్వారా వందల సంఖ్యలో కార్మికులకు ఇజ్రాయిల్‌లో ఉపాధి అవకాశాలు కల్పించింది. మరో వైపు ఈ దేశంలో తెలుగు వారు సుమారుగా ఐదు వేల మంది వివిధ వ్యాపారాలు, ఉద్యోగాలు, ఉన్నత చదువుల కోసం నివాసం ఉంటునట్లు సమాచారం. ప్రస్తుతం బాంబు దాడుల నేపథ్యంలో ఇజ్రాయిలీలతో పాటు వలస కార్మికులు భూగర్భ బంకర్లలో లేదా సమీపంలోని అండర్ గ్రౌండ్ మెట్రోల్లో రాత్రిళ్లు తలదాచుకుంటున్నారని తెలిపారు. ఈక్రమంలో ఇజ్రాయిల్, ఇరాన్ దేశాల్లో ఉన్న తమ వారిని రక్షించే బాధ్యత భారత ప్రభుత్వం తీసుకోవాలని వారి కుటుంబ సభ్యులు విన్నవించుకుంటున్నారు.

భయంభయంగా ఉంది..

నా భర్త కుటుంబ పోషణ కోసం ఇజ్రాయిల్ దేశానికి ఉపాధి నిమిత్తం వెళ్లాడు. కానీ ఏడాదిన్నరగా అక్కడ జరుగుతున్న యుద్ధంతో ఇక్కడ మేము ప్రతీరోజు మేము చస్తూబ్రతుకుతున్నాము. ప్రతీరోజు ఫోన్‌లో ఆయన క్షేమ సమాచారాలు ఇచ్చినప్పటికీ మాలో భయం పోవడం లేదు.

– రమ, ఆర్మూర్ పట్టణం

ఇంటికి రావడం లేదు..

ఇక్కడ పని దొరకక రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో టామ్ కమ్ ద్వారా మా నాన్న ఇజ్రాయిల్‌కు వెళ్లాడు. మేము చేసిన అప్పులే ఇంకా తీరలేవు. కానీ అక్కడి యుద్ధం మా పాలిట కష్టాలను తెచ్చి పెట్టింది. మా నాన్నను ఇంటికి వచ్చేయమని అంటున్నాము. కానీ ఇక్కడి ఆర్థిక పరిస్థితుల కారణంగా నాన్న రావడానికి ఇష్టపడటం లేదు.

– రాజు, నిజామాబాద్

భూ తగాదాలతోనే వస్త్రల వ్యాపారిపై దాడి

- నిందితులను పట్టుకున్న పోలీసులు
- వివరాలు వెల్లడించిన బిచ్కుంద ఎస్సై మోహన్‌రెడ్డి



పోలీసులు పట్టుకున్న నిందితులు

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని ఓ వస్త్ర దుకాణం యజమానిపై కత్తితో దాడి చేసి హత్యాయత్నం చేసిన నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. భూ తగాదాల కారణంగానే దాడి జరిగినట్లు పేర్కొన్నారు. ఈమేరకు ఎస్సై మోహన్‌రెడ్డి ఆదివారం వివరాలను వెల్లడించారు. ఈనెల 15న బిచ్కుందలోని ఓ వస్త్రాల షాపులో యజమాని శేక్ ఖలీల్‌పై గుర్తు తెలియని వ్యక్తులు కత్తితో దాడి చేసి పారిపోయారు. ఈ దాడిలో అతడి కి తీవ్ర గాయాలు అయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, అన్ని కోణా ల్లో విచారణ చేపట్టారు. ఖలీల్‌కు అతడి బంధువులైన షేక్ అమన్ కుటుంబ సభ్యుల మధ్య కొన్నేళ్ల నుంచి భూమి విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఈక్రమంలో ఖలీల్‌ను చంపి భూమి స్వాధీనం చేసుకోవాలని షేక్ అమన్, కుటుంబ సభ్యులు ప్లాన్ వేశారు. నాందేడ్ ప్రాంతానికి చెందిన ముబీన్, రితేష్, వైభవ్, సుషాంత్ నలుగురు వ్యక్తులకు రూ. 2 లక్షలు సుపారీ ఇచ్చి ఖలీల్‌ను హత్య చేయాలని ఒప్పందం చేసుకున్నారన్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. షేక్ అమన్ కుటుంబ సభ్యులు పారారీలో ఉన్నారని ఎస్సై తెలిపారు.

ఎలక్ట్రిక్ స్కూటీ దగ్ధం



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని ఎర్రాపహాడ్ గ్రామంలో ఎలక్ట్రిక్ స్కూటీ దగ్ధం అయినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన మైసాగౌడ్ మూడు సంవత్సరాల క్రితం ఎలక్ట్రిక్ స్కూటీ తీసుకున్నాడు. ఆదివారం అతడు తన ఇంటి ముందు స్కూటీని నిలిపి చార్జింగ్ ఉంచారు. చార్జింగ్ పూర్తయిన అనంతరం విద్యుత్ కనెక్షన్ తీసివేశాడు. కానీ అప్పటికే చార్జింగ్ కారణంగా వేడెక్కిన స్కూటీకి ఎండలు కూడా ఎక్కువగా ఉండడంతో అందరు చూస్తుండగానే ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. స్కూటీ పూర్తిగా బూడిదయిందన్నారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

దోమకొండ: మండలంలోని చింతమాన్‌పల్లి గ్రామంలో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై ప్రవంతి తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన పసుల రాజేందర్(28)కు చిన్నప్పటి నుంచి ఫిట్స్ వ్యాధి ఉండటంతో చాలా ఆస్పత్రుల్లో చికిత్స తీసుకున్నాడు. అయినా వ్యాధి తగ్గకపోవడంతో తరచు బాధపడుతుండేవాడు. జీవితంపై విరక్తి చెంది గతంలో చాలాసార్లు ఆత్మహత్యకు యత్నించాడు. ఈక్రమంలో ఆదివారం ఇంట్లో ఎవరు లేని సమయంలో దూలానికి చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి తిరుమల్లవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

పుప్పాలపల్లి గ్రామంలో..

జక్రాన్‌పల్లి: మండలంలోని పుప్పాలపల్లి గ్రామంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై మాలిక్ రెహమాన్ తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన బండమీద గంగాధర్ (52) కొంతకాలంగా మతిస్థిమితం లేక తిరుగుతున్నాడు. తన పాత ఇంటిలో గంగాధర్ ఆదివారం ఉరి వేసుకుని ఆత్మహత్య పాల్పడ్డాడు. భార్య లక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కొండాపూర్‌లో వివాహిత..

రాజంపేట: మండలంలోని కొండాపూర్ గ్రామంలో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై పుష్పరాజ్, మృతురాలి తల్లి తెలిపిన వివరాలు ఇలా.. దోమకొండ మండలం చింతపండుపల్లి గ్రామానికి చెందిన భాగ్యలక్ష్మి–బాలరాజుల కూతురు లావణ్య(24)కు మూడేళ్ల క్రితం కొండాపూర్ గ్రామానికి చెందిన ఆంజనేయులుతో వివాహం జరిగింది. లావణ్య ఇటీవల తన బాబు పుట్టినరోజు సందర్భంగా డబ్బులు లేకపోవడంతో తన అత్త, మామల నుంచి ఆస్తిపంపాకాలు చేసుకోవాలని తన భర్త తెలిపింది. కానీ, భర్త మౌనంగా ఉండడంతో ఈనెల 21న రైతుబంధు పడడంతో అత్తమామలను రైతుబంధు డబ్బులు అడగాలని తెలపగా భర్త అడగలేదు. ఈవిషయమై మనస్తాపం చెందిన లావణ్య ఇంట్లో ఎవరు లేని సమయంలో చీరకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. వెంటనే భర్త ఆమెను కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈమేరకు తల్లి భాగ్యలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

నగరంలో ఒకరు..

నిజామాబాద్‌నాగారం: డిచ్‌పల్లి రైల్వే స్టేషన్ ప్రాంతంలో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. నగరంలోని సాయికృపనగర్‌కు చెందిన రాజరపు శ్రీనివాస్(25) ఇటీవల బీటెక్ పాస్ అయినట్లు తల్లిదండ్రులకు బంధువులకు తెలిపాడు. కానీ ఈ నెల 21న అతడు ఫెయిల్ అయినట్లు కుటుంబసభ్యులకు తెలిసింది. దీంతో శ్రీనివాస్ కుటుంబసభ్యులకు నిజం తెలిసిందని మనస్తాపం చెంది, అవమానంతో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.